# అప్రజ్ఞాత యజ్ఞం

కొల్లిపట్నపు రామారావు





# అప్రజ్ఞాత యజ్ఞం

కాళీపట్నపు రామారావు

కావ్య
పబ్లిషింగ్ హౌస్

తొలి ప్రచురణ : నవంబర్ 9, 2014
ISBN: 978-93-83057-13-9

ముఖచిత్ర చిత్రకారుడు
సరాగమ్ (1966)

*ప్రచురణ*
**కావ్య పబ్లిషింగ్ హౌస్**
12-13-830/13/బి, ఫ్లాట్ నెం.103,
ఎస్.ఎస్.ఆర్. అపార్ట్‌మెంట్స్,
గోకుల్‌నగర్, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017.
ఫోన్ : 9989599135
email : kavyaph11@gmail.com

For eBOOK: kinige.com

*ప్రతులకు*
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
నవోదయ బుక్‌హౌస్, హైదరాబాదు.
మైత్రీ బుక్‌హౌస్, విజయవాడ.

***వెల రూ. 60/-***

*ముద్రణ*
చరిత ఇంప్రెషన్స్
హైదరాబాద్ - 500 020.

# అప్రజ్ఞాతం



*ప్రథమ ప్రచురణ*

*జయభారత్ : నవంబరు, 1951*

**ముం**దు ముందు ఎందరి దృష్టినో ఆకర్షించే సంఘటనైనా జరిగేటప్పుడు దాని ప్రాధాన్యతను గ్రహించలేము. అతి సామాన్యంగా జరిగిపోతుంది. ఆనాడు జగన్నాధస్వామి ఆలయంలో జరిగిన సంఘటన కూడా అలాంటి వాటిలో ఒకటి.

సుదర్శనం యువకుడు. పట్నంలో బి.ఎ. పరీక్షకు కూర్చున్నాడు. ఫలితాల కోసం ఎదురుచూస్తూ స్వగ్రామంలో ఉన్నాడు. వయసు మిగిలాక చదువులో ప్రవేశించడం వల్ల విద్యార్థే అయినా విద్యార్థిలా కనిపించడు.

ఆ ఉదయం కాలక్షేపం కోసమే అతడు ఆలయానికి వెళ్ళాడు. అప్పటికే కొందరక్కడ చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. కొంత సేపటికవి రాజకీయాల మీదకీ నడిచాయి.

రాజకీయాలు చర్చించటమంటే పార్టీలనూ ప్రభుత్వాలనూ తత్సంబంధీకులనూ దుమ్మెత్తి పోయటమే. పట్టణాల్లో అయినా పల్లెల్లో అయినా రాజకీయ చర్చలు రాజకీయ చర్చలే.

ఆసరికి కాంగ్రెస్‌ను తూర్పార బట్టడం జరిగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోసేశారు. నెహ్రూ చేతకానితనం గూర్చి వాపోవడం ముగిసింది. కథ కమ్యూనిస్టుల మీదికి మళ్ళింది. కమ్యూనిజం యొక్క అమానుషత్వం గురించి చర్చ సాగుతోంది.

పట్టణాల్లో చదువుకున్న వాళ్ళలోనే యిలాంటి తెలిసీ తెలియని వాళ్ళు చాలా మందుంటారు. అలాంటి వాళ్ళను చూస్తే సుదర్శనానికి

ఒళ్ళు మంట. అయితే – మరీ భరించలేనప్పుడు తప్ప వాళ్లను ప్రతిఘటించడు.

పార్టీలో మెంబర్‌షిప్ లేకపోయినా సుదర్శనానికి ఆ పార్టీ పట్ల సానుభూతి ఉంది. కమ్యూనిస్టులను విమర్శించినా అతడు సహించగలడు గాని వాళ్ళ సిద్ధాంతం తప్పుడు సిద్ధాంతమంటే అతడు తట్టుకోలేడు.

ఆరోజు అక్కడ చేరిన వాళ్లలో ఎవరు ఏం వాగినా అతడు ఖాతరు చేయకపోను. బుచ్చిలింగం కూడా వాళ్లతో గొంతు కలుపుతుంటే అతడు ఓర్చుకోలేక పోయాడు.

బుచ్చిలింగం పరిస్థితులు ఒకప్పుడు బాగానే ఉండేవి. ఆపదలకూ ఆడపిల్లల పెళ్ళిళ్ళలకూ అప్పులుచేసి వడ్డీలతోనూ వడ్డీలకు వడ్డీలతోనూ కోర్టు ఖర్చులతోనూ అవి పెరిగిపోగా భూమీ పుట్రా సమస్తం పోయి ఇప్పుడు తిండికి కూడా కష్టపడుతున్నాడు.

అందుకని–

"నీకు కమ్యూనిజాన్ని గురించి ఏం తెలుసని దానిని విమర్శిస్తా వయ్యా?" అన్నాడు వీలైనంత సౌమ్యంగానే.

బుచ్చిలింగం వయసున చాలా పెద్దవాడైనా పల్లెటూరి సాంప్రదాయాల ననుసరించి ఏకవచన ప్రయోగం సభ్యతా దూరం కాదు.

సుదర్శనం సవాలు అందరి దృష్టినీ ఆకర్షించింది.

కొంత గొడవ తరువాత కమ్యూనిజం గురించి అతడు చెప్పడానికీ తక్కిన వాళ్లు వినడానికీ అంగీకారం కుదిరింది.

పార్టీ రాజకీయాల మీద చర్చ వెనక్కి వాయిదా వేసి సిద్ధాంతం ఎందుకు పుట్టిందో అదేమంటుందో ముందు చెపుతానన్నాడు సుదర్శనం. అతడేం చెప్పినా దానిని ఖండించడమే వాళ్ల లక్ష్యం కాబట్టి – "సరే! అదే చెప్పు"– అన్నారు.

ఈ దేశంలోనే కాక దాదాపు అన్ని దేశాల్లోనూ తినడానికి ఉన్న వాళ్ళు తక్కువా తిండి లేని వాళ్లే చాలా చాలా ఎక్కువ! ఈ పరిస్థితి ఎలా వచ్చిందో చెప్పి – పెట్టుబడి, పెట్టుబడిదారీ ఉత్పత్తి, మిగులుశ్రమ వంటి పారిభాషిక పదాలను వివరిస్తూ పట్టణాల్లో పెద్దపెట్టున సాగే పారిశ్రామిక దోపిడీ గురించి క్లుప్తంగా చెప్పి పల్లెల్లో సాగే భూస్వామ్య దోపిడీ గురించి చెపుతున్నాడు. ఇంతలో అక్కడకు సూరప్పడు వచ్చాడు.

అతడు రాగానే అక్కడున్న వాళ్లంతా – 'ఏం అన్నా! ఏం బావా! ఏం దద్దీ! ఏవండీ!' అంటూ వరసగా పలకరింపుల్లో పడ్డారు. అతడు అందరికీ అన్ని వరసల్లోనూ జవాబిచ్చి "మీరేదో మాటాడుకుంటున్నారు కావాల! మాటాడుకోండి. మాటాడుకోండి" అంటూ ఆలయం లోపలికి వెళ్లిపోయాడు. సుదర్శనం ఆపినచోట ఎత్తుకొని ముందుకు పోతున్నాడు.

ఆ ఊళ్లో సంపన్నులందర్లోకీ సంపన్నుడు సూరప్పడు. మనిషి మాత్రం అలా కనిపించడు.

ముతక ఖద్దరు గావంచా ఒకటి కట్టుకొని పై మీద ఒక తువాలుతో అప్పుడప్పుడే పైబడుతున్న ముసలి రూపుతో తల వంచుకొని తన పనుల మీద తిరుగుతుంటాడు. మనిషెంత నిరాడంబరుడో మాటంత మృదువు. పని పడితే తప్ప పలకరింపులకు మించి మాటాడడు.

అతడు భగవంతుణ్ణి నమ్ముతాడు. పాపమంటే భయం. పుణ్యకార్యాల పట్ల ఆసక్తీ ఉన్నవాడు. ఆవాళ శనివారమని కాబోలు – పొత్తిగావంచా కట్టుకొని, చేతిలో పూజా ద్రవ్యాల పళ్లెం పట్టుకొని, భుజాన తడి అంగ వస్త్రంతో, నుదట తిరునామాలతో దేవాలయం కొచ్చాడు. ఆలయంలో అర్చకులు కనిపించకపోగా ప్రాకారంలోనే ఉన్న ఆయన యింటికి వెళ్లాడు. అక్కడ నుండి వచ్చాక సావిడిలో సాగుతున్న గోష్ఠి వింటున్నాడు.

సుదర్శనం ఆసరికి భూస్వామ్యంలో జరిగే దోపిడీ గురించి చెప్పటం దాదాపు పూర్తయ్యింది. ఒకటి రెండు విషయాలు మిగిలిపోతే అడ్డు ప్రశ్నలు వేసే వాళ్లతో 'ఆగండి ఆగండి' అంటూ పూర్తి చేస్తున్నాడు.

అక్కడున్న వాళ్లలో ఎవ్వరూ సుదర్శనం పాటి చదువుకున్న వాళ్లు కారు. అయినా, ఆమాటకొస్తే అందుచేతే, సుదర్శనాన్ని ఓడగొట్టాలని వాళ్ళకు గట్టి పట్టుదలగా ఉంది.

సుదర్శనం చెప్పేది పారిభాషిక పదాలకూ, పారిశ్రామిక దోపిడీకీ పరిమితమై సాగినంతసేపూ వాళ్లకు లంగరు అందలేదు. ఎంత శ్రద్ధగా విన్నా ప్రత్యుక్తులు దొరకలేదు. పల్లెలో సాగే దోపిడీ గురించి చెపుతుంటే మాటమాటకీ వాళ్ళకి ప్రత్యుక్తులు కనిపిస్తున్నాయి. చాలాసార్లు అతన్ని అడ్డు తగలబోయారు. మధ్యలో మాటాడడానికి సుదర్శనం అవకాశం ఇవ్వక పోవడంతో వాళ్లెలాగో ఓపిక పట్టారు. సుదర్శనం ఆఖరు విషయం కూడా చెప్పేసి ఆగిపోయాక బుచ్చిలింగమే ముందుకు వస్తూ అడిగాడు.

“అయ్యిందా? ఇప్పుడు నే అడగొచ్చా?” అన్నాడు తల తాటిస్తూ–

అడగొచ్చున్నాడు సుదర్శనం.

“ఇప్పుడు మీ నాన్నగారే ఉన్నారు. ఆయనా వ్యవసాయం చేయిస్తు న్నారు. చేయించింది మరీ పెద్ద వ్యవసాయం కాకపోవచ్చు. కాని, ఇందాక నువ్వన్నావే! పెద్ద పెద్ద భూస్వాములని, ఆళ్లలాగే యీయనా పొలంలోకి దిగడు. కాళ్లకీ చేతులకీ బురదవదు. పాలేళ్లూ కూలోళ్లూ కంబార్లూ కూలీలే పంటలు పండించి గింజలు ఇంట్లో పోస్తారు. అయితే ఆయనా వాళ్ల శ్రమను దోచుకుంటున్నట్టేనా?”

సుదర్శనం శాంతంగా జవాబిచ్చాడు. “అవును. ఆయనా ఓ తరహా భూస్వామే. ఆయన చేసేదీ దోపిడీయే. సరిపోయిందా?” అని– “నేను చెపుతున్నది – నేనూ మా నాన్నగారూ కష్టార్జితంతో బతుకుతున్నామనీ

తక్కిన వాళ్లంతా దోపిడీచేసి బతుకుతున్నారనీ కాదు. పెట్టుబడిదారీ విధానంలో దోపిడీ ఉంది. ఆ దోపిడీ వల్ల, రెక్కలు ముక్కలు చేసుకునే వాళ్లకు దక్కేది తక్కువనీ, దాదాపు సంపదంతా దోచుకునే వాళ్లకే దక్కుతోందనీ, చెపుతున్నాను. తెలిసిందా?" అన్నాడు సుదర్శనం.

సుదర్శనం మాట శాంతంగానే వున్నా అతని మొహంలో ఆవేశం కనిపిస్తోంది. వాళ్ళందరూ అతడికన్నా వయసులో పెద్దవాళ్లు. కుర్రవాడి మొహంలో ఆవేశం చూసేసరికి ఒకళ్లిద్దర్లో చిలిపితనం కూడా తలెత్తి నట్టుంది. ఒక్కొక్కరే అడ్డ సవాళ్లు విసురుతున్నారు.

"అది కాదయ్యా! పాలేర్ల చేతా కూలీలచేతా పని చేయించుకుంటే వాళ్ళకు జీతమో కూలో ఇస్తున్నాం కదా! అందులో దోపిడీ ఎక్కడుందీ" నారాయణయ్య అడిగాడు.

"తగిన జీతం, తగిన కూలి యియ్యటం లేదు. వాళ్లకు రెండు రూపాయలు ముట్టవలసిన చోట రూపాయ ముడుతోంది."

"రెండు రూపాయలివ్వ వలసిన చోట రూపాయి యిస్తే వాళ్లెందు కొస్తారూ?"

సుదర్శనం క్షణకాలం నిరుత్తరుడై పోయాడు ఉత్తరం లేక కాదు. తోచక కాదు. ఇంతసేపూ చెప్పింది వాళ్లకు బోధపడలేదా? లేక వాదనే వాళ్లకు ముఖ్యమా!" – అని ఆలోచిస్తున్నాడు. ఈ రెండిటిలో ఏదైనా అతడు కొనసాగించి ప్రయోజనం లేదు.

"చెప్పు. రెండు రూపాయలు ముట్టవలసిన చోట రూపాయే ముడితే వాళ్లెందుకొస్తారు?" నారాయణయ్య రైతు. అతనడుగుతున్నాడు.

"అంటే కథ మళ్లా మొదటికొచ్చిందన్న మాట!" అన్నాడు సుదర్శనం.

దానిమీద – అంతవరకూ గుంభనంగా ఉండిపోయిన బైరాగి జోక్యం చేసుకున్నాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Apragnaata+Yagnam**

* * *